పేదల గూడుపై నిర్లక్ష్యపు పిడుగు

ఆలూరులోని గుంతకల్లు రోడ్డులో నిలిచిపోయిన గృహ నిర్మాణాలు



- నిలిచిన గృహ నిర్మాణాలు
- వైఎస్సార్‌సీపీ హయాంలో నియోజకవర్గంలో 71 లేఅవుట్లలో 14,159 మందికి ఇళ్లు మంజూరు
- నిర్మాణాల పూర్తికి సహకరించని కూటమి ప్రభుత్వం
- లేఅవుట్లలో పెరిగిపోయిన పిచ్చిమొక్కలు
- కొన్ని గ్రామాల్లో శిథిలమవుతున్న గృహాలు
- ఎన్నటికి పూర్తవుతాయోనని లబ్ధిదారుల ఆందోళన

ఆలూరు రూరల్: పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేసింది. నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అర్హులందరికీ ఇళ్లను మంజూరు చేసి నిర్మాణాలకు నిధులు మంజూరు చేశారు. అయితే నిర్మాణాలు ఆలస్యమవడంతో పూర్తి కాలేదు. ఈ లోపు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. వైఎస్ జగన్ మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలకు నిధులు విడుదల చేయకపోవడం, వాటి గురించి పట్టించుకోవడం లేదు. దీంతో నిర్మాణాలు అసంపూర్తిగా మిగిలిపోయాయి. చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు దాటినా ఒక్క ఇంటి నిర్మాణం కూడా పూర్తి కాలేదు. అలాగే పెండింగ్‌లో ఉన్న బిల్లులు విడుదల చేయలేదు. ఫలితంగా లబ్ధిదారులు నిర్మాణాలను మధ్యలోనే నిలిపివేశారు.

స్థలాలు కొని.. పేదలకు అందజేసి..

జగనన్న హయాంలో నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా ప్రభుత్వ స్థలాలు లేకపోయిన చోట ఊరూరా అందుబాటులో ఉన్న ఖరీదైన స్థలాలను కొనుగోలు చేసి మరీ లేఅవుట్లు వేసి స్థలాలను మహిళలకు అందజేసింది. ఆలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధిలో 71 లేఅవుట్లు వేసి అందులో 14,159 మందికి పట్టాలను రిజిస్ట్రేషన్ చేయించి ఇచ్చింది. అలాగే వారందరికీ గృహాలు నిర్మించుకునేందుకు నాటి ప్రభుత్వం రూ.1.80 లక్షల చొప్పున మంజూరు చేసింది. నిర్మాణంలో వివిధ దశలను బట్టి నగదు అందజేసేవారు. సొంతంగా ఇళ్లు కట్టుకోలేని వారి కోసం కాంట్రాక్టర్లను కూడా ఏర్పాటు చేసింది. అయితే వివిధ కారణాలతో నిర్మాణాలు ఆలస్యమయ్యాయి.



నగరడోణ లేఅవుట్‌లో పిచ్చిమొక్కలు మొలిచిన దృశ్యం

గృహ నిర్మాణాలు పూర్తయ్యేదెన్నడో..

కూటమి ప్రభుత్వం వచ్చాక అసంపూర్తి ఇళ్ల నిర్మాణాలను పట్టించుకోవడం మానేసింది. వివిధ దశల్లో ఉన్న నిర్మాణాలు ఎప్పుడు పూర్తవుతాయోనని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పనులు నిలిచిపోవడంతో లేఅవుట్లలో పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. కొన్ని గ్రామాల్లో అసంపూర్తి నిర్మాణంలో ఉన్న ఇళ్లు శిథిలమైపోతున్నాయి. గృహ నిర్మాణాలను పట్టించుకోకపోవడంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల సమయంలో వైఎస్ జగన్ కన్నా మిన్నగా సంక్షేమం అందజేస్తామని చెప్పి నేడు పేదల ఇళ్ల నిర్మాణాలను గాలికొదిలేయడంపై ఆయా గ్రామాల్లో లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేవలం వైఎస్సార్‌సీపీ మంజూరు చేసిందనే అక్కసుతోనే పట్టించుకోవడం లేదనే విమర్శలు ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి. కాగా నిర్మాణాలు పూర్తిపై అధికారులు స్పందిస్తూ.. ప్రభుత్వం నుంచి నిధులు విడుదలైన వెంటనే లబ్ధిదారులకు అందజేసి పనులు పూర్తయ్యేలా చూస్తామని చెబుతున్నారు.

క్లుప్తంగా

బైక్‌పై మహాకుంభమేళాకు..



బైక్‌పై బయలుదేరిన గోపాల్‌స్వామి, రాఘవేంద్ర

ఆలూరు: బెళ్లగుండా ఆంజనేయ స్వామి అర్చకుడు గోపాల్‌స్వామి బైక్‌పై ప్రయాగ్‌రాజ త్రివేణి సంగమంలో జరుగుతున్న మహా కుంభమేళాకు గురువారం సాయింత్రం బయలుదేరి వెళ్లారు. ఆయనను ఆలయ కమిటీ నిర్వహకులు, గ్రామ పెద్దలు సాగనంపారు.

ఎల్లార్తి కిటకిట



సమాధులను దర్శించుకుంటున్న భక్తులు

హొళగుంద: ఎల్లార్తి షేక్షావలి, షాషావలి దర్గాల్లో గురువారం వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారు. ఈ సందర్భంగా జెండాలు, నైవేద్యంతో దర్గాలకు వచ్చి సమాధులకు చాదర్ సమర్పించి ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. మొక్కులో భాగంగా రాత్రి దర్గా ఆవరణంలో పలువురు భక్తులు నిద్రించారు. అలాగే.. సాయిబన్న, చిణిగితాతా దర్గాల్లో, షిర్డిసాయిబాబా ఆలయాలను సందర్శించారు.

ఉద్యోగులకు బదిలీ సాధారణం



ఎస్‌ఐ గోపాల్‌ను సన్మానిస్తున్న దృశ్యం

పత్తికొండ రూరల్ : ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సాధారణమని పత్తికొండ సీఐ జయన్న పేర్కొన్నారు. గురువారం పత్తికొండ పోలీసు స్టేషన్‌లో ఎస్‌ఐగా పనిచేస్తూ బదిలీపై అనంతపురం వెళ్తున్న ఎస్‌ఐ మొలగవల్లి గోపాల్‌కు వీడ్కోలు పలికారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు, న్యాయవాదులు, వ్యాపారులు, ప్రముఖులు హాజరై ఎస్‌ఐ గోపాల్‌ను సత్కరించారు.

ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోండి



నిరుద్యోగులకు నియామక పత్రాలను అందజేస్తున్న దృశ్యం

ఆలూరు: ఉద్యోగ, ఉపాధి అవకాశాలని నిరుద్యోగ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కర్నూల్ ఎంపీ బస్తిపాడు నాగరాజు, గుంటూరు జిల్లా పత్తిపాడు ఎమ్మెల్యే బి.రామాంజనేయులు తెలిపారు. గురువారం పట్టణంలోని ఇబ్రహీం ఫంక్షన్ హాల్‌లో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బి. వీరభద్రగౌడు ఆధ్వర్యంలో జాబ్‌మేళా కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వివిధ కంపెనీలకు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశారు. మాజీ మంత్రి మారెప్ప, బీజేపీ నాయకుడు వెంకటరాముడు, రఘుప్రసాద్‌రెడ్డి, గిరిమల్లేష్ గౌడు పాల్గొన్నారు.

ఆలయ పునరుద్ధరణకు సహకరించండి

తుగ్గలి : గ్రామస్తులు, భజన మండలి సభ్యుల కోరిక మేరకు జొన్నగిరిలోని పురాతన శివాలయాన్ని గురువారం జియో మైసూర్ గోల్డ్‌మైనింగ్ కంపెనీ డైరెక్టర్ మానసరంజన్, పీఆర్వో రామ్మోహన్‌రెడ్డి సందర్శించారు. శివాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందని, పునరుద్ధరణ చేపట్టదలచినట్లు గ్రామస్తులు, భజన బృందం సభ్యులు తెలిపారు. ఆలయ పునరుద్ధరణకు కంపెనీ సహకారం అందించాలని కోరారు. యాజమాన్యం దృష్టికి తీసుకెళ్తామని కంపెనీ ప్రతినిధులు తెలిపారు.

కారుమంచిలో ఘనంగా ఉరుసు

ఆస్పరి: మండలంలోని కారుమంచి గ్రామంలో గురువారం నేముటూరు ఉశేన్ వలి తాత ఉరుసు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గాలో ప్రత్యేక పార్థనలు చేశారు. తాత సమాధిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. సర్పంచ్ లక్ష్మి, వైస్ ఎంపీపీ చంద్రకళ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

పత్తికొండ రూరల్ : సాగునీరు, ప్రతి గ్రామానికి తాగునీరు సాధనకు ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు కడపలో జరిగే రాయలసీమ జిల్లాల ప్రాజెక్టుల మహాసభలను జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి డి.రాజాసాహెబ్, నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు ఉమాపతి, సురేంద్రకుమార్ కోరారు. గురువారం వారు మాట్లాడుతూ కరువు సీమకు కృష్ణాజలాలే శరణ్యమని గత కొన్నేళ్లుగా చేసిన పోరాటాల ఫలితంగానే హంద్రీనీవా, గాలేరు నగరి ప్రాజెక్టులు తీసుకొచ్చారని కానీ నేటికీ వాటిని పూర్తి చేయకుండా ప్రభుత్వాలు కాలయాపన చేయడం దారుణమన్నారు. అన్నివర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

విద్యార్థి దశ కీలకం



మినల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి

ఆలూరు: విద్యార్థి దశ ఎంతో కీలకమైందని ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి అన్నారు. మండలంలోని అరికెర గ్రామ అంబేడ్కర్ గురుకుల బాలుర పాఠశాలలో గురువారం ప్రిన్సిపాల్ మనోజ్‌రాజ్ ఆధ్వర్యంలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులను ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని కోరారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎంపీపీ రంగమ్మ, వైఎస్సార్‌సీపీ మండలం అధ్యక్షుడు మల్లికార్జున, ఐటీ విభాగం అధ్యక్షుడు వరుణ్, మండల కో-కన్వీనర్ వీరేష్, రాజ్,మాజీ ఎంపీటీసీ ఉరుకుందప్ప, రాముడు, నాగేంద్ర పాల్గొన్నారు.

సంక్షిప్తం

నీటి సమస్య పరిష్కారానికి నివేదికలు

పత్తికొండ రూరల్ : డివిజన్ కేంద్రమైన పత్తికొండతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో నెలకొన్న తాగు నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ సీపీఎం నాయకులు చేసిన విజ్ఞప్తిపై జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా స్పందించారు. సమస్య పరిష్కారానికి నివేదికలు పంపించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించడంతో గురువారం సంబంధిత డీఈ ఖాన్, ఏఈ విష్ణువర్ధన్‌రెడ్డి డివిజన్ పరిధిలోని గ్రామాలకు తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.689 కోట్లు ఖర్చవుతుందని అంచనాతో కలెక్టర్‌కు నివేదికలు పంపించారు.

సర్వేల పురోగతిపై డీఎల్‌డీవో సమీక్ష

తుగ్గలి : ప్రభుత్వం నిర్వహిస్తున్న వివిధ సర్వేల పురోగతిపై స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం సచివాలయ సిబ్బందితో డీఎల్‌డీఓ అనురాధ సమీక్ష నిర్వహించారు. పీ ఫోర్ పబ్లిక్ సర్వే, సహకార సంఘంలోని ఖాతాదారుల వివరాలు, పేదల వివరాల సేకరణ, యాప్‌ల వినియోగంపై పలు సూచనలు చేశారు. సర్వేలు వేగవంతం చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీఓ విశ్వమోహన్, ఈవోపీఆర్డీ శ్రీహరి పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

హొళగుంద: ప్రయాణికులు, బాటసారుల దాహార్తి తీర్చేందుకు చిన్నహ్యాట గ్రామ యువకులు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్కే గిరి అన్నారు. గురువారం చిన్నహ్యాట గ్రామ సమీపంలోని ఎల్లార్తి రోడ్డులో వెలిసిన అవదూత వీరేశప్ప తాత మఠం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. గ్రామస్తులు లక్ష్మీపతి, భీమన్న, బసప్ప, వీరేష్, యల్లప్ప, రాజు పాల్గొన్నారు.

హాస్టల్‌ను పునఃప్రారంభించండి

హొళగుంద: మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి కేంద్రాన్ని పునః ప్రారంభించాలని బీజేపీ సీనియర్ నాయకులు చిదానంద, కేఎస్ ప్రసాద్, మహేష్, బెనకప్ప, జగదీశ్ కోరారు. ఈ మేరకు గురువారం ఇన్‌చార్జ్ తహసీల్దారు నిజాముద్దీన్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ రూ.88 లక్షలతో నిర్మించిన ఎస్సీ హాస్టల్‌ను కొన్నేళ్ల క్రితం మూసివేశారని, తిరిగి ప్రారంభించి కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.

కేంద్ర బడ్జెట్‌పై నిరసన

ఆస్పరి: కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్ సామాన్యులకు ఉపయోగపడటం లేదని సీపీఐ నాయకులు గురువారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. నాయకులు కృష్ణమూర్తి, బ్రహ్మయ్య, కృష్ణ మాట్లాడుతూ ఈ బడ్జెట్‌తో సామాన్యులకు ఒరింగిందేమీ లేదన్నారు. కేవలం కార్పొరేట్ వ్యక్తుల ఆస్తుల పెంపునకు ఉపయోగపడేలా రూపొందించారని మండిపడ్డారు. నల్లన్న, చంద్రశేఖర్, లక్ష్మన్న, రామాంజిని, కృష్ణ, రామయ్య, మద్దిలేటి పాల్గొన్నారు.

పట్టపగలే వాహనాల చోరీ

మద్దికెర : మండల కేంద్రంలో వారం రోజుల నుంచి పట్టపగలే మూడు టీవీఎస్ ఎక్స్‌ఎల్ ద్విచక్రవాహనాలు చోరీకి గురయ్యాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ పనులు ముగించుకొని కొద్దిసేపు సేదతీరుదామని ఇంటి ముందు వాహనాలు నిలిపి ఉంచితే లేచి చూసే లోపు కనిపించడం లేదని, పలుచోట్ల వెతికినా ఫలితం కానిపించకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్నట్లు గురువారం బాధితులు తెలిపారు.

శిక్షణ తరగతుల పరిశీలన



శిక్షణ తరగతులను పరిశీలిస్తున్న సీడీపీఓ శశికళ

హొళగుంద: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలంలోని అయా అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లకు జరుగుతున్న 6 రోజుల అంగన్ వాడీ సర్టిఫికెట్ కోర్సు (జ్ఞానజ్యోతి) శిక్షణ తరగతులను ఐసీడీఎస్ సీడీపీఓ శశికళ గురువారం పరిశీలించారు. డీఆర్పీలు శిక్షణ తీరును గమనించి పలు సూచనలు చేశారు. ఐసీడీఎస్ సుపర్‌వైజర్ షీభా రాణి, సీఆర్పీ రేణుక పాల్గొన్నారు.

కార్మికులందరూ ఈ–శ్రమ్ కార్డు పొందాలి

వెల్దుర్తి: అసంఘటిత కార్మికులందరూ ఈ–శ్రమ్ కార్డు పొందేలా చూడాలని కార్మిక శాఖ డోన్ సహాయాధికారి నీలిమ సంధ్య కోరారు. గురువారం ఆమె ఎంపీడీఓ సుహాసినితో సమావేశమయ్యారు. అనంతరం ఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఉపాధి కూలీలందరికి రూ.2లక్షల ప్రమాద బీమా వర్తించే అవకాశమున్న ఈ–శ్రమ్ కార్డు పొందేలా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఏపీఓ లక్ష్మన్న, ఈసీ పృథ్వీ పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

మద్దికెర : ఎన్నికల ముందు అలవి కాని హామీలు ఇచ్చి అధికారం చేపట్టిన అనంతరం హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ శాసనసభ్యులు కంగాటి శ్రీదేవి విమర్శించారు. గురువారం మండలంలోని ఎం.అగ్రహారం గ్రామంలో ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని ప్రమాణం చేశారన్నారు. భవిష్యత్‌కు గ్యారెంటీ- ఇది బాబు గ్యారెంటీ అని చెప్పి ప్రస్తుతం వాటి అమలును గాలికొదిలేసి ప్రజలను మోసం చేశారన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో ఉన్నత విద్యనభ్యసించే విద్యార్థులు కూలీ పనులు చేసుకుంటున్నారంటే ఇంతకన్నా దౌర్భాగ్యం ఇంకేముంటుందన్నారు. జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, కేడీసీసీ బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, మండల కన్వీనర్ మల్లికార్జున, కృష్ణగిరి ఎంపీపీ డాక్టర్ వెంకటరామిరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ పక్కీరప్ప, నాయకులు గంపల వెంకటేశులు, శేఖర్, కృష్ణ, బొమ్మనపల్లి వెంకటేశులు, భరత్‌రెడ్డి, శివప్ప, నాగభూషణం పాల్గొన్నారు.



సుభాష్‌ను పరామర్శిస్తున్న కంగాటి శ్రీదేవి, ఎంపీపీ డాక్టర్ వెంకట్రామిరెడ్డి

దాడులు మంచి పద్ధతి కాదు..

కృష్ణగిరి: అధికార మదంతో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులకు పూనుకోవడం, అక్రమ కేసులు బనాయించడం మంచి పద్ధతికాదని పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. మండలంలోని రామకృష్ణాపురం గ్రామంలో తమ పార్టీ నాయకుడు బోయ సుభాష్‌పై బుధవారం టీడీపీ నాయకులు దాడి చేసి గాయపరచడంతో డోన్ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతుండగా గురువారం ఎంపీపీ కంగాటి వెంకట్రామిరెడ్డితో కలిసి వెళ్లి పరామర్శించారు. పార్టీ మండల కన్వీనర్ ఆర్బీ వెంకట్రాముడు, పత్తికొండ మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ కటారుకొండ మాధవ రావు ఉన్నారు.

నోటీస్ బోర్డు

నేడు సబ్సిడీ రుణాలకు ఇంటర్వ్యూలు

తుగ్గలి : స్థానిక ఎంపీడీఓ కార్యాలయలో శుక్రవారం ఉదయం 10గంటల నుంచి సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విశ్వమోహన్ గురువారం తెలిపారు. మండలంలోని బీసీ, ఈబీసీ, కాపు, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, బ్రాహ్మణ కులాలకు సంబంధించి సబ్సిడీ రుణాల కోసం 50 యూనిట్లకు గాను 830 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ దరఖాస్తుతో పాటు ఒరిజనల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు.

పత్తికొండ రూరల్ : బీసీ కార్పొరేషన్ కింద స్వయం ఉపాధి కోసం దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగ యువతీ,యువకులకు రుణాల మంజూరుకు శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఎంపీడీఓ సువర్ణలత తెలిపారు. మండలంలో ఇప్పటి వరకు 1,200 దరఖాస్తులు వచ్చాయన్నారు.

ఆస్పరి: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నుంచి బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించునున్నట్లు ఎంపీడీఓ గీతావాణి గురువారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ శుక్రవారం ఆస్పరి ఎస్బీఐ, ఐఓబీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులకు దరఖాస్తు చేసుకున్న వారికి, శనివారం ఆస్పరి, కైరుప్పల ఏపీజీబీ బ్యాంకుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని చెప్పారు.

చిప్పగిరి: రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అల్లాబకాష్ గురువారం తెలిపారు. మొత్తం 450 మంది రుణాలకు దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు.

మద్దికెర : బీసీ కార్పొరేషన్ ద్వారా అందించే సబ్సిడీ రుణాలకు గ్రామాల వారీగా ధ్రువ పత్రాలు పరిశీలన కార్యక్రమం చేపడుతున్నామని ఎంపీడీఓ కొండయ్య గురువారం తెలిపారు. మండలానికి 50 యూనిట్లు మంజూరు కాగా..677 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఆంధ్రప్రగతి గ్రామీణ పరిధిలో ఈనెల 21న పెరవలి, 22న హంప, కెనరా బ్యాంకు పరిధిలో 21న మద్దికెర, 22న బురుజుల గ్రామాలకు దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూ నిర్వహిస్తామని చెప్పారు.

కృష్ణగిరి: రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 21వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మోహన్ కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 571మంది రుణాలకు దరఖాస్తు చేసుకున్నారని, స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 11గంటల నుంచి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

27న రాష్ట్రస్థాయి భజన పోటీలు

తుగ్గలి : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని ముక్కెళ్ల గ్రామంలో ఈనెల 27వ తేదీన రాష్ట్ర స్థాయి భజన పోటీలు ఏర్పాటు చేసినట్లు గ్రామస్తులు గురువారం తెలిపారు. పోటీల విజేతలకు దాతల సహకారంతో వరుసగా అర తులం బంగారు, రూ.25వేలు, రూ.15వేలు, రూ.10వేలు, నుంచి వెయ్యి వరకు బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు సెల్ : 9581192265, 7799266073 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నేడు సామాజిక తనిఖీ బహిరంగ సభ

హొళగుంద: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఈనెల 22వ తేదీన 2023–24 సంవత్సరానికి సంబంధించి 17వ విడత సామాజిక తనిఖీ బహిరంగ సభ ఉంటుందని ఎంపీడీఓ విజయలలిత గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో చేసిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ బృందంసేకరించిన వివరాలను వెల్లడిస్తారన్నారు. సభకు ఉపాధి కూలీలు, ప్రజలు, అధికారులు హాజరు కావాలని కోరారు.

సారా తయారీపై ఉక్కుపాదం




బుగ్గతండాలో అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ సీఐ విశ్వేశ్వరరావు

పత్తికొండ(తుగ్గలి) : సారా తయారీ, అమ్మకాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని పత్తికొండ సర్కిల్ ఎక్సైజ్ సీఐ విశ్వేశ్వరరావు హెచ్చరించారు. సారా నిర్మూలనే ధ్యేయంగా ప్రభుత్వం చేపట్టిన నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా గురువారం రాత్రి బుగ్గతండాలో గ్రామసభ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ..సారా తయారీ, అమ్మకాలు జరపడం చట్టరీత్యా నేరమన్నారు. సారా తయారీకి స్వస్తి చెప్పి ప్రశాంత జీవనం గడపాలని సూచించారు. లేనిపక్షంలో బైండోవర్, పీడీ యాక్టు కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తామని హెచ్చరించారు. ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

నాటుసారా నిర్మూలనకు చర్యలు

వెల్దుర్తి: నవోదయం కార్యక్రమం ద్వారా నాటుసారా నిర్మూలనకు చర్యలు తీసుకోనున్నట్లు కోడుమూరు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మంజుల గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. నవోదయంలో భాగంగా మండల, గ్రామ స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసి వారి సహకారంతో గ్రామ సభలు నిర్వహించి నాటు సారా తయారీ, అమ్మకాల నిర్మూలనకు అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే సారా తయారీ స్థావరాలు, అమ్మకాలు జరిగే ప్రదేశాలను గుర్తించామని, తాము దాడులు చేపట్టి కేసులు నమోదు చేస్తామన్నారు. నాటు సారా తయారీ, అమ్మకాలపై ప్రజలు సైతం వారికున్న సమాచారాన్ని 9440902575 నంబరుకు అందించాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని వెల్లడించారు.

దిగొచ్చిన వెల్లుల్లి



తుగ్గలి : సామాన్యులకు అందనంత ధరకు చేరిన వెల్లుల్లి క్రమంగా దిగి వస్తోంది. నెల క్రితం కిలో రూ.400 ఉండగా ఆ తర్వాత రూ.180 వచ్చింది. ప్రస్తుతం కిలో రూ.100కు లభిస్తోంది. ఆటోల్లో కిలో వెల్లుల్లి రూ.100కు విక్రయిస్తున్నారు. దీంతో వినియోగదారులు ఊపిరి పీల్చుకుంటున్నారు.

వివాహిత ఆత్మహత్య

హొళగుంద: సుళువాయి గ్రామంలో రాధమ్మ (32) గురువారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఆమెకు భర్త మల్లన్నగౌడ్, ముగ్గురు సంతానం. కాగా ఆత్మహత్యకు గల వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు.

దరఖాస్తుల పరిశీలన

హాలహర్వి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు గురువారం ఎంపీడీఓ వరలక్ష్మి ఆధ్వర్యంలో బ్యాంకు మేనేజర్లు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఏపీజీబీ హాలహర్వి బ్యాంకు మేనేజర్ సత్యనారాయణ, చింతకుంట బ్యాంకు మేనేజర్ ఈశ్వర్ కళ్యాణ్, గూళ్యం బ్యాంకు మేనేజర్ సాయిశ్రీకార్ దరఖాస్తులను పరిశీలించారు. శుక్రవారం ఇండియన్ బ్యాంకు పరిధిలోని హాలహర్వి, మెదేహాల్, ఆలూరు ఎస్‌బీఐ పరిధిలో దరఖాస్తులు చేసుకున్న నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు ఉంటాయని ఎంపీడీఓ వివరించారు.

రైతులకు తప్పని అగచాట్లు



చిప్పగిరి రైతు సేవా కేంద్రంలో సాయంత్రం 6 గంటల సమయంలో కొనసాగుతున్న నమోదు ప్రక్రియ

చిప్పగిరి: సొంత పొలం ఉన్న రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ప్రభుత్వం సూచించింది. దీంతో మండలంలోని 9 రైతు సేవా కేంద్రాల్లో నమోదు ప్రక్రియను వ్యవసాయ అధికారులు చేపట్టారు. అయితే ఉదయం 11 గంటలలోపు, సాయంత్రం 4 గంటల తరువాత మత్రమే సర్వర్ పని చేస్తుండటం, మధ్యాహ్న సమయంలో సర్వర్ మొరాయిస్తుండటంతో రైతులకు నిరీక్షణ తప్పడం లేదు. గురువారం స్థానిక రైతు సేవా కేంద్రంలో సాయంత్రం 6 గంటలైనా నమోదు ప్రక్రియ కొనసాగడంతో రైతులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. కాగా..ఇప్పటి వరకు మండలంలో మొత్తం 2,900 మంది రైతులు విశిష్ట గుర్తింపు సంఖ్య పొందినట్లు ఏఓ జయలక్ష్మి తెలిపారు.

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

దేవనకొండ: ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని ఏఐవైఎఫ్ మండల అధ్యక్షుడు బి.రవికుమార్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నూతన ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు మెగా డీఎస్సీ విడుదల చేయకపోవడం దారుణమన్నారు. డీఎస్సీ పేరుతో నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటున్నారని మండిపడ్డారు. అమరావతిని ఫ్రీ జోన్‌గా చేసి 26 జిల్లాల్లో ఉన్న నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. బడ్జెట్ సమావేశాల్లో నిరుద్యోగులకు రూ.10 వేలు నిరుద్యోగభృతి వచ్చేలా నిధులు విడుదల చేయాలని కోరారు. శంకర్, నరేష్, నభిరసూల్, నరసింహులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

పత్తికొండ రూరల్ : సైబర్ నేరాల నియంత్రణపై గురువారం పత్తికొండలోని సాంఘీక సంక్షేమ హాస్టల్‌లోని విద్యార్థులకు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మాలతి ఆధ్వర్యంలో జరిగిన అవగాహన సదస్సులో పత్తికొండ సీఐ జయన్న అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ సోషల్ మీడియా ద్వారా కొందరు నేరగాళ్లు ఆశ చూపించి ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. వీటి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సాంఘీక సంక్షేమ శాఖ డివిజనల్ అధికారి బాబు, వార్డెన్ నాగరాజు, పీఈటీ రాజేష్ పాల్గొన్నారు.

ఆట, పాటలతో అక్షరాలు నేర్పించాలి



అంగన్‌వాడీ కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎంఈఓ కె.శ్రీనివాసరెడ్డి

మద్దికెర : అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆట, పాటలతో అక్షరాలు నేర్పించాలని ఎంఈఓ-2 గోపాల్ సూచించారు. గురువారం స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ టీచర్లకు జ్ఞానజ్యోతి కార్యక్రమంలో శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ల బొమ్మల తయారీని పరిశీలించారు. ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, లక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌభాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

హాలహర్వి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని ఎంఈఓ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీలకు వచ్చే పిల్లలకు ఎలా బోధించాలనే విషయంపై రిసోర్స్‌పర్సన్స్ జీహెచ్‌ఎం భూషణ్, హనుమంతప్ప, విమల్‌తేజలు అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు.